క్లుప్తంగా

సంపత్‌కుమార్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జియాలజీ విభాగం పరిశోధకుడు సంపత్‌కుమార్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. పెట్రోగ్రఫీ జియోకెమిస్ట్రీ అండ్ పెట్రోజెనిసిస్ ఆఫ్ గ్రానైట్స్ ఫ్రం గంగాధర ఏరియా కరీంనగర్ డిస్ట్రిక్ట్ ఆఫ్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సంపత్‌కుమార్‌కు పరిశోధన పూర్తి చేశారు. దీంతో డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి వెల్లడించారు. ఆ విభాగం రిటైర్డ్ ఆచార్యులు డేవిడ్ పర్యవేక్షణలో సంపత్‌కుమార్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

కుర్చీలు అందజేత



హన్మకొండ: ది నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ కరుకాల అనితా రెడ్డి దివ్యాంగుల బాలుర వసతి గృహానికి ఉచితంగా కుర్చీలు అందించారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని దివ్యాంగుల వసతి గృహంలో కుర్చీలు అందజేశారు. అనంతరం వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన కల్పించారు. తాను అండగా ఉంటానన్నారు. ఏ సమస్య ఉన్న తనకు తెలియజేయాలని చెప్పారు. ఎన్నో ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడుతున్నాయని, వీటిని లక్ష్యంగా చేసుకుని ప్రతి ఒక్కరు పోటీ పరీక్షకు సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో ది.నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ జనరల్ సెక్రటరీ కరుకాల రాంరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి


మల్లేశం(ఫైల్)

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధుడు దాసరి మల్లేశం(110) మంగళవారం మృతి చెందాడు. కొంతకాలంగా దాసరి మల్లేశం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిజాం వ్యతిరేకంగా తాను పనిచేసినట్లు చెబుతుండేవాడని స్థానికులు తెలిపారు. కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ నివాళులర్పించారు.

వేగంగా కొనసాగుతున్న అండర్ డ్రెయినేజీ పనులు

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని పల్లవి ఆస్పత్రి లేన్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌తోపాటు కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి తరుచుగా పర్యవేక్షిస్తున్నారు. నాణ్యత కూడిన నిర్మాణ పనులు చేపడుతున్నారు. తాగి నీటి పైపులైన్ ధ్వంసం ఏరియాలో వాటర్ ట్యాంకర్ల ద్వారా తెప్పించి నీటిని సరఫరా చేపడుతున్నారు. గత ఏడాది నుంచి అండర్ డ్రైనేజీల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు నిర్వహిస్తున్నారు. శివనగర్‌ను వరద ముంపు నుంచి కాపాడేందుకు నిర్మాణ పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. త్వరలోనే అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేస్తామని, మరో రెండు నెలల్లో పూర్తి చేసేందుకు వేగంగా చర్యలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

హన్మకొండ: నూతన నటీనటులతో జశ్వవి మూవీ మేకర్స్ నిర్మాణంలో వస్తున్న 'భీం భూమికి జై' సినిమా పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్–టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా, సంఘం నాయకులు ఆవిష్కరించారు. హనుమకొండ వడ్డెపల్లిలోని జై బీం యూత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేష్ ఖన్నా మాట్లాడారు. సినిమాను ఆదరించాలని, ప్రతి ఒక్కరు వీక్షించాలని కోరారు. చిత్రం యూనిట్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు కంజర్ల సందీప్, అసిస్టెంట్ డైరెక్టర్స్ రాకేష్ గూడా, సిలువేరు సుధాకర్, చిత్ర యూనిట్ కె.వి.వంశీ కృష్ణ, ఎస్ ఎస్ రాజు, విశ్వం జీ, మాదాసి పవన్, కొక్కండ విష్ణు, ఎమ్మార్పీఎస్–టీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి విజయ్ కుమార్, సాతూరి వెంకన్న, కోమల, స్వామి, యోబు, సుమన్, రాకేష్, తిరుపతి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ట్రెనింగ్ ఎంప్లాయింట్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్‌లో భాగంగా నిరుద్యోగ మైనార్టీ యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మేన శ్రీను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీఓ, అకౌంట్ అసిస్టెంట్ టాలీ కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల నిరుద్యోగులు ఈనెల 21 లోగా తమ దరఖాస్తులను సుబేదారిలో గల మైనార్టీ సంక్షేమాధికారి కార్యాలయంలో అందించాలని, ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రారంభించారు.. వదిలేశారు

- నిరుపయోగంగా ఆటస్థలాలు
- ప్రజాధనం దుర్వినియోగం



సిద్ధాపురంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

హసన్‌పర్తి: పలు గ్రామాల్లో క్రీడాప్రాంగణాలు ప్రారంభించారు. కానీ, వాటిని వినియోగంలోకి తీసుకురావడం లేదు. క్రీడాకారులు వెళ్లకపోడంతో మైదానాలు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. మైదానంలో క్రీడాకారులు అడుగు పెట్టిన దాఖలు లేవని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. సర్కార్ భూములు, పాఠశాలల్లో ఆటస్థలాలు గుర్తించి అభివృద్ధి చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఇందు కోసం ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.లక్ష కేటాయించింది. హసన్‌పర్తి మండలంలో 15 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో పెంబర్తి, సిద్ధాపురం, జయగిరి గ్రామాల్లో మాత్రమే క్రీడామైదానాల కోసం స్థలాలు గుర్తించారు. ఇందులో వాలీబాల్ కోర్టును మాత్రమే ఏర్పాటు చేశారు. ఒక్కొక్క గ్రామానికి రూ.లక్ష వెచ్చించి క్రీడా మైదానాలు అభివృద్ధి చేసినా.. నిరుపయోగంగా మారాయి దీంతో.. ప్రజాధనం వృథాగా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పెంబర్తి వాసులకు దూరంగా..

పెంబర్తి గ్రామానికి సుమారు నాలుగు కిలో మీటర్ల దూరంలో ఓ ప్రైవేట్ వెంచర్‌లో ఆటస్థలాన్ని అభివృద్ధి చేశారు. దీంతో స్థానికంగా వ్యతిరేక వ్యక్తమవుతోంది. అటువైపు ఎవరూ వెళ్లడంలేదు. మండలంలో మిగిలిన గ్రామాల్లో కూడా క్రీడామైదానాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లపై అధికారులు ఒత్తిడి తీసుకోస్తున్నారు. వారం రోజుల క్రితం పల్లెప్రగతిపై మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సర్కారీ భూములు గుర్తించి ఆటస్థలాలు ఏర్పాటు చేయాలని అధికారులు హుకుం జారీ చేశారు. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేని పక్షంలో పాఠశాలల్లోనైనా ఆటస్థలాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆసక్తి చూపని సర్పంచ్‌లు

ఆటస్థలాలు ఏర్పాటుకు సర్పంచ్‌లు ఆసక్తి చూపడం లేదు. మండలంలో మూడు గ్రామాల్లో ఆటస్థలాలు అభివృద్ధి చేస్తే ఇప్పటీ వరకు నిధులు రాలేదని సర్పంచ్‌లు పేర్కొంటున్నారు. ఇప్పటికే గ్రామపంచాయతీ నిధులు విడుదల కాక అప్పుల పాలైనట్లు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రీడా మైదానాల కోసం నిధులు విడుదల చేస్తే తప్పపనులు చేపట్టేది లేదని సర్పంచ్ చెబుతున్నారు. సూదన్‌పల్లి, అన్నాసాగరం, మల్లారెడ్డిపల్లి, భైరాన్‌పల్లి, సీతానాగారం, కొత్తపల్లి, హరిశ్చంద్రనాయక్ తండాల్లో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేవు. ఇక్కడ పాఠశాలల్లో ఆటస్థలాలు ఏర్పాటు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం


క్రీడాకారులతో రైల్వే అధికారులు

కాజీపేట రూరల్: క్రీడలు సంపూర్ణ ఆరోగ్యానికి, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడతాయని రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ సీనియర్ డీఈఈ ప్రశాంత కృష్ణసాయి, ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు, కాజీపేట సీఐ మహేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట రైల్వే స్టేడియంలో రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అధికారులు టాస్ వేసి టోర్నమెంట్స్ ప్రారంభించి, మాట్లాడారు. రైల్వే కార్మికుల్లో క్రీడలు, క్రికెట్ పోటీలు పని ఒత్తిడిలు అధిగమించడంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. మొదటి మ్యాచ్‌లో రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ జట్టు–ఇంజనీరింగ్ 11 జట్లు తలపడి ఆడగా జనరల్ ఇనిస్టిట్యూట్ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో ఆపరేటింగ్ 2 జట్టు–సిఅండ్‌డబ్ల్యు జట్టు తలపడగా సీ అండ్‌డబ్ల్యు జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో రైల్వే ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, ట్రెజరర్ జి.రాజేశ్వర్‌రావు, సభ్యులు ఎస్.ఆర్.ప్రశాంత్, దారవత్ రఘు, ప్రవీన్, పి.ప్రశాంత్, బి.మాధవరావు, రైల్వే జెఎసి చైర్మన్ కొండ్ర నర్సింగరావు, డీజిల్ షెడ్ మజ్దూర్ యూనియన్ బ్రాంచీ సెక్రటరీ ఎ.శ్రీనివాస్, ట్రెజరర్ పాక వేదప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'దళితబంధు' ఎంపిక ఐఏఎస్‌లకు అప్పగించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: దళితబంధు లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యానికి స్వస్తి పలకి, ఎంపిక ప్రక్రియను ఐఏఎస్ అధికారికి అప్పగించాలని ఎమ్మార్పీఎస్–టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. నిరుపేద దళితులకు దళిత బంధులో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 14న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నా కరపత్రాలను మంగళవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్–టీఎస్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేష్ ఖన్నా మాట్లాడారు. దళితబంధు లబ్ధిదారుల ఎంపిక ఎమ్మెల్యేలు చేయడంతో పైరవీదారులు, దళారులు పెరిగారని, లబ్ధిదారుని నుంచి రు.2లక్షల చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దళితబంధు అమలుకు స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని, ఐఏఎస్ అధికారి చైర్మన్‌గా నియమించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. ఈ మేరకు ఫిబ్రవరి 14న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ఎమ్మార్పీఎస్–టీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్–టీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సాతూరు వెంకన్న, మేడ స్వామి, దేవేందర్, బొంకూరి భద్రయ్య, కోమల, సుధాకర్, అంబాల చక్రపాణి, గంగారపు సుమన్ కుమార్, రాకేష్, శ్రీనివాస్, రాజశేఖర్, తిరుపతి, పుట్ట నవీన్, జాను, సంజీవ, విజయకాంత్ పాల్గొన్నారు.

హామీ విస్మరించినందుకే భూ పోరాటాలు


సీపీఐ జెండాలతో నాయకులు, తదితరులు

వరంగల్: తెలంగాణ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చక పోవడంతోనే సీపీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూముల్లో జెండాలు పాతుతున్నామని వరంగల్ మండల సీపీఐ కార్యదర్శి బుస్సా రవీందర్ అన్నారు. మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదురుగా ఉన్న మట్టెవాడ రెవెన్యూ గ్రామ శివారు కోట చెరువు పరిధిలోని సర్వే నెంబర్ 374, 375, 376, 378 గల ప్రభుత్వ భూమిలో జెండాలను పాతి ఆక్రమించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ కబ్జాదారులు ఆక్రమించిన ప్రభుత్వ భూమిని.. పేద ప్రజలకు పంచుతామని అన్నారు. ప్రభుత్వ భూములను కబ్జాదారులు ఆక్రమిస్తే ప్రభుత్వ అధికారులు వారి మీద ఎలాంటి కేసులు పెట్టకుండా.. ఇళ్లు లేని పేదలు గుడిసెలు వేసుకుంటే వాళ్ల మీద కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. నిరుపేదలకు భూమి దక్కేంత వరకు భూ పోరాటాలు ఆపేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుండె భద్రి, సంద్ర కుమార్, పరికిరాల రమేష్, రవి, రమేష్, దస్రూ, ఖాసీం, అయిల్లయ్య, వెంకన్న, అంజాద్, స్వప్న, పద్మ తదితరులు పాల్గొన్నారు.

29న రెడ్డి సంక్షేమ సంఘం ఎన్నికలు

హన్మకొండ: వరంగల్ రెడ్డి సంక్షేమ సంఘంలో ఖాళీ అవుతున్న మేనేజింగ్ కమిటీ సభ్యుల పదవులకు ఈ నెల 29న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు మాదిరెడ్డి రవీందర్ రెడ్డి, కార్యదర్శి మేరుగు హనుమారెడ్డి, ఎన్నికల అధికారి పి.జయధీర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. సంఘంలో ప్రతి సంవత్సరం 1/3 వంతు మేనేజింగ్ కమిటీ సభ్యుల స్థానాలు ఖాళీ అవుతాయని వారు ఒక ప్రకటనలో వివరించారు. వీటిని భర్తీ చేసేందుకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 13న నోటిఫికేషన్ జారీ, 20, 21 తేదీల్లో సాయంత్రం 4.00 నుంచి 6.00 గంటల వరకు నామినేషన్ స్వీకరించనున్నట్లు తెలిపారు. 22న స్క్రూటిని, 23న ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రదర్శించనున్నట్లు వివరించారు. ఈ నెల 29న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, అనంతరం కౌంటింగ్ జరిపి ఫలితాలు ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

యువతి అదృశ్యం

రామన్నపేట : వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగంపేటలో నివాసముంటున్న దానిమ్మపల్లి సారిక(19) అదృశ్యమైనట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు. నేత్ర వైద్యశాలలో పారామెడికల్ రెండో సంవత్సరం చదువుతున్న సారిక సోమవారం ఉదయం 9.30 ఇంటి నుంచి వెళ్లింది. 11.30 ప్రాంతంలో టిఫిన్ బాక్స్ ఇచ్చేందుకు సారిక మామ కళాశాలకు వెళ్లగా అక్కడ లేకపోవడంతోపాటు, ఫోన్ నంబర్ స్విచ్ఆఫ్ అయినట్లు గుర్తించారు. ఈ క్రమంలో యువతి కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం సారిక తండ్రి సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'ధర్మకర్తల మండలి నియామకంలో మోసం'

ఐనవోలు : ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గొల్ల కురుమలను మోసగించిందని బీజేపీ జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్‌రావు ఆరోపించారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మంగళవారం మాట్లాడారు. మండలిలో గొల్ల కురుమలకు స్థానం కల్పించినట్లు నమ్మిస్తూనే ఎండోమెంట్ చట్టం పేరుతో అవమానించిందని తెలిపారు. మండలి నియామకంలో సభ్యుల అర్హత అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు, ఆలయ అధికారులకు తెలిసినా డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. మండలిపై చర్యలు తీసుకోవాలని కోటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు.

ఆటో డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలి

ఖిలా వరంగల్: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, లేకుంటే వాహనాన్ని సీజ్ చేస్తామని మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ హెచ్చరించారు. ఈమేరకు మంగళవారం వరంగల్ 37వ డివిజన్ శంభునిపేట దూపకుంట రోడ్డులోని గిరిప్రసాద్‌నగర్‌లో కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, బీఆర్ఎస్ నేత బోగి సురేష్, ఎండీ ఉల్ఫత్‌తో కలిసి ఆటో అడ్డాను ప్రారంభించి, మాట్లాడారు. డ్రైవర్లు లైసెన్స్‌లు, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండాలని, ప్రయాణికులతో క్రమ శిక్షణగా మెలగాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తతంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో షేక్ సమీరుద్దిన్, వేల్పుల సతీష్, రబ్బాని, ప్రతాప్, సురేష్, కిరణ్, నూరుద్దిన్, మహేష్ మహిఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

17 మందిపై కేసు నమోదు

రామన్నపేట : వరంగల్ పోలీసు కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు నంబర్ ప్లేట్ లేకపోవడంతో పాటు, నంబర్ ట్యాపరింగ్ చేస్తున్న వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి చేస్తున్న విస్తృత తనిఖీల్లో భాగంగా మంగళవారం 17 మందిపై కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ సీఐ బాబుల్ తెలిపారు. బట్టల్‌బజార్, ఎంజీఎం జంక్షన్‌లలో తనిఖీలు నిర్వహించగా, ద్విచక్రవాహనాలకు ముందు, వెనుక నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుతుపుతున్న భూక్య, నిఖిల్, కడారి, సుధాకర్, ఎండీ ఇమ్రాన్, లునావత్, మహేష్, శివానందశాస్త్రి, కట్రోజు, యాసాని సురేశ్, దేవోర, లవిపాల్, జన్ను సుధాకర్, రామగిరి విజయ్‌కుమార్, అరువ రాకేశ్, తలల చందర్, వద్దలపు శ్రవణ్కుమార్, తమ్మిశెట్టి బాలకృష్ణ, ఉగ రాకేశ్, పుట్ట రాకేశ్, అనుమందల మధులపై ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

21వ డివిజన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న పుర్కాన్

వరంగల్: నగరంలోని 21వ డివిజన్లో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ పుర్కాన్ మంగళవారం పరిశీలించారు. డివిజన్‌లో రూ.38 లక్షలతో చేపట్టిన పనులను ఆయన రెండు నెలల క్రితం ప్రారంభించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఇదిలా ఉండగా.. నేటి నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు పరీక్షల కోసం ఎల్బీనగర్ లోని తాజ్ కన్వెన్షన్ ఏర్పాటు చేసిన సెంటర్లో ఎలాంటి ఏర్పాటు చేయలేదని కార్పొరేటర్ పుర్కాన్ ఆరోపించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ జిల్లా స్థాయి అధికారులు దృష్టి పెట్టకపోవడంతో సెంటర్లలో ఎలాంటి ఏర్పాట్లు లేవన్నారు. వెంటనే రోగుల కోసం సౌకర్యాలు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి


ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

హన్మకొండ: నిజామాబాద్ జిల్లాలో దళిత ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌ను కులం పేరుతో దూషిస్తూ దేవుడి గుడికి తీసుకెళ్లి బొట్టు పెట్టించి, గ్రామ వీధుల్లో ఊరేగించిన ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాద దుండగులపై కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.ప్రభాకర్ రెడ్డి, వేల్పుల సారంగపాణి డిమాండ్ చేశారు. ఈ దుశ్చర్యలను ఖండిస్తూ మనువాదులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు జి. ప్రభాకర్ రెడ్డి, వేల్పుల సారంగపాణి మాట్లాడారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ సాటి మనిషిని మనిషిగా చూడలేని దుర్మార్గపు స్థితి నేడు బీజేపీ పాలనలో సర్వ సాధారణమైందని ఆరోపించారు. వేల సంవత్సరాల నాటి బూజు పట్టిన మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని, మతం పేరుతో దైవభక్తి ముసుగులో ప్రజల్లో చిచ్చు పెడుతుందని, దళితులు, గిరిజనులు, మహిళలపై విచ్చలవిడిగా దాడులు చేస్తూ రాజ్యాంగ స్వరూపాన్నే మార్చేస్తుందని ధ్వజమెత్తారు. మల్లికార్జున్‌ను కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పుల్లా అశోక్, నిడిగొండ రజిత, బొంత కొమురవెల్లి, రాజేష్, రమేష్, రాజు, శివాని, సమ్మయ్య, జైపాల్, చంద్రమౌళి పాల్గొన్నారు.

చోరీల నివారణకు పోలీసుల తనిఖీలు



కాజీపేట: కాజీపేట పట్టణంలో సంక్రాంతి పండుగ ఆరంభం నుంచి పోలీసుల తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. స్థానిక రైల్వే జంక్షన్, టౌన్ స్టేషన్‌లకు వచ్చే రైళ్లలో వివిధ రాష్ట్రాలకు చెందిన గుర్తు తెలియని వ్యక్తులు పట్టణానికి వచ్చి, తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. ఈనేపథ్యంలో స్థానికంగా సీఐ మహేందర్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు బృందాలుగా విడిపోయి విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నారు. రాత్రి వేళల్లో బస్టాండ్, రైల్వే స్టేషన్లు, ప్రధాన రహదారులపై రాత్రి వేళల్లో సంచరిస్తున్న, నిద్రిస్తున్న వ్యకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. టాబ్ సహాయంతో వేలి ముద్రలు వేయించి, గతంలో ఏమైనా కేసులు ఉన్నాయా అనే విషయాలను పరిశీలిస్తున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కాశిబుగ్గ: శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వసతి భవనం (ట్రస్ట్), విశ్వకర్మ సహకార పరపతి సంఘం వివేకానందకాలనీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ బండా ప్రకాష్, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌లు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మారెడోజు సదానందచారి, మాజోజు శ్రీనివాస్, సోల్లెటి రాఘవాచారి, పుల్లాచారి, సిద్దోజు బ్రహ్మచారి కమిటీ సభ్యులు, కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, మాజీ కార్పొరేటర్లు ఓని భాస్కర్, బయ్య స్వామి పాల్గొన్నారు.

పరామర్శ

హసన్‌పర్తి: నీటిపారులశాఖ వరంగల్ సర్కిల్ చీఫ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌రెడ్డిని మంగళవారం హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్, హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ సుధీర్‌కుమార్‌లు పరామర్శించారు. ఇటీవల సుధాకర్‌రెడ్డి సతీమణి పద్మ మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వారు నయీంనగర్‌లోని సుధాకర్ రెడ్డి ఇంటికి వెళ్లి, పరామర్శించారు.

నియామకం

కాజీపేట: యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎండీ రహమతుల్లాను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి మంగళవారం రాత్రి ఆదేశాలను జారీ చేశారు. కాజీపేట పట్టణానికి చెందిన రహమతుల్లా గత ఆరు సంవత్సరాలుగా ఎన్ఎస్‌యుఐ లో కీలకంగా పని చేస్తున్నారు. సోషల్ మీడియా జాతీయ కోఆర్డినేటర్‌గా ఉన్న రహమతుల్లాకు యువజన కాంగ్రెస్‌లో అవకాశం కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. యూత కాంగ్రెస్‌లో చోటు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్న నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ 37వ డివిజన్ తూర్పు కోట ప్రాంతానికి చెందిన 22 ఏళ్ల యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుకోటకు చెందిన యువతి గన్నారపు కృష్ణవేణి (22) ఈనెల 16వ తేదీన తెల్లవారు జామున తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం వరకూ తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితులు ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో కృష్ణవేణి సోదరుడు తరుణ్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు.

రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయాలి

ఖిలా వరంగల్: కుటుంబ సభ్యులకు తెలియకుండా తన భర్త రహస్యంగా విక్రయించే ఇంటి స్థలానికి తక్షణమే రిజిస్ట్రేషన్ ఆపేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి వరంగల్ ఉర్సు గుట్ట రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించింది. అనంతరం బాధితురాలు సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా బాధితురాలు నిడికొండ సృజన మాట్లాడుతూ.. తనకు ఇద్దరు పిల్లలు దీపక్, లోకేష్ ఉన్నారని, భర్త నిడికొండ నర్సయ్య రెండేళ్లుగా కుటుంబంతో దూరంగా ఉంటున్నాడని చెప్పారు. అంతేకాకుండా ఎస్ఆర్ఆర్ తోటలోని 1768 సర్వే నంబర్‌లో 110 గజాల ఇంటి స్థలం భర్త నర్సయ్య పేరిట ఉందని, తమకున్న ఏకైక ఆధారం ఇంటి స్థలమేనని తెలిపారు. ఈక్రమంలో తమ కుటుంబానికి తెలియకుండానే విక్రయిస్తున్న ఇంటి స్థలానికి రిజిస్ట్రేషన్ చేయకుండా తక్షణమే నిలిపివేయాలని సబ్ రిజిస్ట్రార్‌ను కోరానని తెలిపారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి


కమ్యూనిటీ హాల్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్

న్యూశాయంపేట: కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వరంగల్ నగర డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ అన్నారు. మంగళవారం నగరంలోని 36 డివిజన్ చింతల్ కమ్యూనిటీ హాల్‌లో పార్టీ నాయకులు, మహిళా సంఘాల నేతలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్‌లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. పేదల ఆరోగ్యం కోసం కేసీఆర్ పెద్దన్నలా వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశంలో డాక్టర్ మోహన్‌రావు, కంటి వెలుగు ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ సంపత్‌రెడ్డి, నాయకులు ఎలగొండ యాకయ్య, మధు నర్సింహాచారి, అనిల్, అబ్బు, రాజ్‌కుమార్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

'గ్రేటర్' కంటివెలుగు కేంద్రాలు..

గీసుకొండ: చింతల్ 36వ వార్డులో(40 రోజులు), చింతల్ వార్డు 21లో(33), చింతల్ వార్డు 35లో(38), దేశాయిపేట 12వ వార్డులో(37), దేశాయిపేట 22వ వార్డులో(20), ఫోర్ట్ వరంగల్ వార్డు 39లో(19), ఫోర్టు వరంగల్ 37వ వార్డులో(31), కాశిబుగ్గ 19వ వార్డులో(29) కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పైడిపెల్లి 3వ వార్డులో(36), పైడిపెల్లి 17వ వార్డులో(34), రంగశాయిపేట 42వ వార్డులో(29), రంగశాయిపేట 41వ వార్డులో(34), ఎస్ఆర్ఆర్ తోట 39వ వార్డులో(26), ఎస్ఆర్ఆర్ తోట 32వ వార్డులో(40), 15వ డివిజన్ మొగిలిచర్లలో(35), 16వ వార్డు కీర్తినగర్‌లో(25) రోజుల పాటు పరీక్షలు నిర్వహించనున్నారు.

రచయితకు అభినందన


రచయితకు అభినందన పత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ కల్చరల్ : హన్మకొండకు చెందిన విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం సంచాలకులు చొల్లేటి కృష్ణమాచార్యులు ఇటీవల రచించిన కాల్పనిక సాహిత్యంగా వెలువడిన విశ్వబ్రాహ్మ ఆచార్య నాగార్జున చారిత్రాత్మక నవల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంగళవారం హనుమకొండలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృసంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు అలుగోజు కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రచయిత కృష్ణమాచార్యులును సన్మానించి అభినందన పత్రాన్ని అందజేశారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ గతంలో కృష్ణమాచార్యులు తెలంగాణ అమరవీరుల స్వర్ణాక్షర నివాళి, విశ్వకర్మ పురాణం ఉపనిషత్తుల సంకలనం, నీరాజనం వంటి రచనలు చేశారని తెలిపారు. ఆచార్య నాగార్జున నవల వెలువరించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో పాడిచెట్టి విష్ణువర్ధన్, వీణవంక సదానందం, నాగసోమేశ్వరాచారి, సత్యనారాయణ, చక్రపాణి, రవీందర్ పాల్గొన్నారు.

చెత్తకు నిప్పు.. ప్రజలకు ఇక్కట్లు


కాంప్లెక్స్ ఆవరణలో కాల్చి వేస్తున్న చెత్త

కాజీపేట: కాజీపేట పట్టణంలోని ట్రిబుల్ ఎస్ కాంప్లెక్స్ ఆవరణలో చెత్తకుప్పలకు మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టా రు. దీంతో సమీప ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులను ఎదుర్కొన్నా రు. కాలిన చెత్త నుంచి దుర్వాసన వస్తుండడంతో చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవలి కాలంలో చెత్తను కాంప్లెక్స్ ఆవరణలోనే కా ల్చివేస్తుండడంతో ఇబ్బందిగా ఉంటుందని, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.